సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

గురువారం । 1 । జూన్ । 2023



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
రాజుపాలెం మండలంలోని పగిడాల బైపాస్‌లో బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. - 8లో



ఆరోపణలపై చర్చకు సిద్ధం
నారా లోకేష్, భూపేష్‌లు తనపై చేసిన ఆరోపణలపై చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. - 8లో



నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు
నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ మాసుం బాషా తెలిపారు. - 8లో

రైతన్నలకు భరోసా

- ఖరీఫ్ సీజన్ ప్రారంభం రోజే సాగుకు సాయం
- ఒక్కో రైతన్నకు మొదటి విడత కింద రూ. 7,500
- జిల్లాలో 2,05,600 మంది రైతులకు లబ్ధి
- మొదటి విడతలో రూ. 154.871 కోట్లు మంజూరు
- అదే రోజే పంట నష్టపరిహారం కూడా
- నేడు రైతన్నల ఖాతాల్లోకి నగదు జమ
- కడప కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం
- ఆనందంలో అన్నదాతలు

రైతు భరోసా లబ్ధి పొందే వారి వివరాలు..

నియోజకవర్గం	రైతుల సంఖ్య	నగదు కోట్లు (రూ)
బద్వేల్	35152	26.479
జమ్మలమడుగు	37990	28.616
కడప	1081	0.8143
కమలాపురం	32656	24.598
మైదుకూరు	36456	27.461
ప్రొద్దుటూరు	10975	8.2671
పులివెందుల	44798	33.744
ఒంటిమిట్ట	3176	2.392
సిద్దవటం	3316	2.497
మొత్తం	2,05,600	154.871



సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న

కడప అగ్రికల్చర్ : పగలనక, రేయనక... ఎండనక, వాననక పంట పొలాల్లో కష్టించి పనిచేసే రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోంది. విత్తు నుంచి పంట ఉత్పత్తుల వరకు అన్ని రకాల సేవలను ఉన్న ఊర్లో నుంచే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తూ అభయమిస్తోంది. బయట వ్యక్తుల నుంచి అప్పులు తెచ్చుకుని పంటలసాగు ప్రారంభించే దుస్థితికి స్వస్తి పలుకుతూ సాగు ప్రారంభానికి భరోసా ఇస్తోంది. గత నాలుగేళ్లగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం రోజే రైతు భరోసా అందించి అన్నదాతలను ఆదుకుంటోంది. తాజాగా ఈ ఏడాది ఐదవ విడత కింద సాయం అందించేందుకు అన్ని ఏర్పాట్లును పూర్తి చేసింది. సంబంధింత జిల్లాస్థాయి కార్యక్రమాన్ని కడపలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు.

పొలం ఉన్న ప్రతి రైతుకు మూడు విడతల్లో ..
రైతు భరోసా పథకానికి పొలం ఉన్న ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా నిర్ణయించింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద రూ. 6 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 7500 కలుపుకుని రూ. 13,500 పెట్టుబడి సాయం మూడు విడతల్లో రైతు ఖాతాల్లో జమ చేస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో పంట వేసే ముందు జూన్ 1వ తేదీనే మొదటి విడతలో రూ. 7500, అక్టోబర్ నెలలో పంట కోతల సమయంలో రూ. 4 వేలు, ధాన్యం ఇంటికి చేరే సమయం జనవరి నెలలో రూ. 2 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు దారులతోపాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ తదితర ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న కౌలుదారులకు రూ. 13500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

జిల్లాలో 2,05,600 మంది రైతులు ఎంపిక....
జిల్లావ్యాప్తంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి 5వ దశ 1 విడత కింద 2,05,600 మంది రైతులను రైతు భరోసాకు ఎంపిక చేశారు. వీరందరికీ మొదటి విడత కింద రూ. 7500 (రాష్ట్రవాటా రూ. 5500, కేంద్ర వాటా 2000)ను జూన్ 1వ తేదీన రైతు ఖాతాకు జమకానుంది. ఇలా జిల్లావ్యాప్తంగా అందరి రైతులను కలుపుకుని మొత్తం రూ. 154.871 కోట్లు నగదు రైతు ఖాతాలకు జమకానుంది.

పంట నష్టపరిహారం కూడా...
ఈ ఏడాది మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో 20 మండలాల పరిధిలో462 మంది రైతులకు సంబంధించి 342.85 హెక్టార్లకుగాను రూ. 44.21 లక్షల మేర నష్ట పరిహారాన్ని అదే రోజు అందించనున్నారు.

పథకం ప్రారంభ నుంచి రైతు భరోసా చెల్లింపు వివరాలు ఇలా..

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	నగదు కోట్ల రూపాయల్లో
2019–20	2,06,708	279.93
2020–21	2,08,747	280.06
2021–22	1,99,344	269.11
2022–23	2,02,598	235.681
2023–24 (1వ విడత)	2,05,600	154.871

అర్హులందరికీ రైతు భరోసా..



జిల్లావ్యాప్తంగా రైతు భరోసా పథకం కింద ఎంపికైన 2,05,600 మంది రైతులకు జూన్ 1వ తేదీన రూ. 154.871 కోట్లు నగదు జమకానుంది. ఈ మొత్తాన్ని రైతన్నలు ఖరీఫ్ పంటల సాగుకు వినియోగించుకోవాలి. ఇప్పటికే రైతన్నలకు ఖరీఫ్‌లో పచ్చిరొట్టి విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నాము. అలాగే పంటలసాగుకు అవసరమైన ఎరువులను సిద్ధంగా ఉంచాం.
– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 పరీక్షలకు కంట్రోల్ రూమ్

కడప సెవెన్‌రోడ్స్ : జూన్ 3 నుంచి 10వ తేదీ వరకు గ్రూప్‌–1 మెయిన్ పరీక్షల నిర్వహణ దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు సంబంధించి ఎవరికైనా సందేహాలు, సమస్యలుంటే 08562–246344 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. ఉదయం 10.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు అభ్యర్థులు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి తమిళనాడు రాష్ట్రంలోని వేలాంగిణికి ఈనెల 2వ తేదీన ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సర్వీసులు కడప నుంచి రాత్రి 8.00 గంటలకు.. మైదుకూరు, బద్వేలు నుంచి 7.00 గంటలకు బయలుదేరుతాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైవీయూ ప్రిన్సిపల్‌గా రఘునాథరెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న ఆచార్య రఘునాథరెడ్డి

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రధానాచార్యులుగా డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ ఆచార్యులు సామాను రఘునాథరెడ్డిని నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ చింత సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపి వెంకటసుబ్బయ్య అందజేశారు. విశ్వవిద్యాలయాన్ని అకడమిక్, పరిశోధన ప్రమాణాల పరంగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని సూచించారు. ఇదివరకు ప్రిన్సిపల్ స్థానంలో ఉన్న ఆచార్య కె.కృష్ణారెడ్డి పదవీకాలం పూర్తయింది. రఘునాథ రెడ్డి గురువారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరిస్తారు.

వైవీయూలో ఆధునిక వెబ్‌సైట్



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో కాగిత రహిత పాలన వైపు ముందడుగు వేస్తూ ఆధునిక వెబ్‌సైట్‌ను వీసీ ఆచార్య చింతా సుధాకర్ బుధవారం ప్రారంభించారు. కుల సచివులు ఆచార్య వెంకటసుబ్బయ్య, ఐటీ సెల్ సంచాలకులు ఆచార్య ఎన్‌వి శంకర్, ఐక్యుఏసీ బృందంతో కలిసి నెట్వర్కింగ్ సెల్ వెబ్‌సైట్ (httpr://itce.yvu.edu.in)ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఫలితంగా అధ్యాపకులు, సిబ్బంది పరిపాలనాపరంగా అవసరాలుంటే ఆన్‌లైన్‌లోనే విజ్ఞాపనలు సమర్పించి పరిష్కారం పొందవచ్చు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, ఏపీఎస్‌ఎస్‌డీసీ, డీఆర్‌డీఏ సి–డ్యాప్ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 2వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 5 నుంచి 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఎం, బి, డి ఫార్మసీ, పీజీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎంపీహెచ్‌డబ్ల్యు, ఆర్‌ఎంపీ డాక్టర్లు, నర్సులు 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ. 10 వేల నుంచి రూ. 36 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలు, ఫొటోలు తీసుకుని ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 99088 08914 నంబరులో సంప్రదించాలన్నారు.

డ్రై సోయింగ్‌తో జీవ వైవిధ్యం



డ్రై సోయింగ్ పొలాలను పరిశీలిస్తున్న డీపీఎం రామకృష్ణంరాజు

మైదుకూరు : ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్‌తో భూమిలో జీవ వైవిధ్యం ఏర్పడుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపల్లె క్లస్టర్‌లోని పొలాలను బుధవారం ఆయన పరిశీలించి రైతులను అభినందించారు. డ్రై సోయింగ్ పద్ధతి వల్ల ప్రధాన పంటతో పాటు భూమిలో అంతర్ పంటలను సాగు చేయడం వల్ల, ప్రధాన పంటకు రక్షణతో పాటు రైతుకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల యాంకర్ ఆదినారాయణ, నాగలక్ష్మి, అభ్యుదయ రైతు రామానందరెడ్డి పాల్గొన్నారు.

‘అనుడ’ అభివృద్ధికి కృషి

‘సాక్షి’తో వైస్ చైర్మన్ వై. వో నందన్



కడప కార్పొరేషన్ : అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అనుడ) అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఆ సంస్థ వైస్ చైర్మన్ వై.వో నందన్ అన్నారు. కొన్ని మాసాల క్రితమే వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తనదైన శైలిలో ‘అనుడ’ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో ప్రత్యేకంగా మాట్లాడారు. మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగులు, పెన్షనర్ల సొంతింటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ‘జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్’లు ఏర్పాటు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మొదట అన్నమయ్య జిల్లాలోని రాయచోటి దిగువ అబ్బవరంలో లే అవుట్ వేయగా, అందులోని ప్లాట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయన్నారు. అందులో వేస్తున్న బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని, రాయచోటి ఔటర్ రింగ్ రోడ్డు నుంచి లే అవుట్ వరకూ రూ.10కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం కానుందన్నారు. రెండో దశ కింద అక్కడే మరో 20 ఎకరాల్లో రెండో లే అవుట్ వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. బద్వేల్‌లో గోపవరం మండలంలో నేషనల్ హైవేకు పక్కనే ‘జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్’ ఏర్పాటు చేశామని, తాజాగా రైల్వేకోడూరులో తిరుపతి రోడ్డులో గ్రీన్ నేషనల్ హైవే పక్కనే మరో లే అవుట్ వేశామన్నారు. ఈనెల 23 నుంచి ఆన్‌లైన్‌లో ప్లాట్ల కొనుగోలుకు దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, కడపలో వైవీయూ సమీపంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందన్నారు. అన్ని రకాల అనుమతులు పొంది, సకల సౌకర్యాలతో హైవేల పక్కనే ఏర్పాటవుతున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లలో చదరపు గజం ధర బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘పొగాకు వద్దు.. ఆరోగ్యమే ముద్దు’

రాజంపేట : ‘పొగాకు వద్దు.. ఆరోగ్యమే ముద్దు’ అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.కొండయ్య పిలుపునిచ్చారు. జాతీయ పొగాకు దినోత్సవ సందర్భంగా రాజంపేటలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.ఎస్‌సీ కృషి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మీప్రసన్న, వికాస్, అశోక్, మస్తాన్ బీ, సౌజన్య, ఎంపీహెచ్‌వో అండ్ సీహెచ్‌వో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, టీబీ సూపర్‌వైజరు జయప్రకాశ్, శివరాం, పీపీ యూనిట్ సిబ్బంది సిద్దిరామయ్య, నీరజ, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

‘మెడికల్ అండ్ హెల్త్’లో
సాధారణ బదిలీలకు సన్నాహాలు

- 30 శాతం చొప్పున బదిలీలు
- ఐదేళ్లు సర్వీసు దాటిన వారికి బదిలీ తప్పనిసరి
- జోన్‌–4 పరిధిలో ఉద్యోగుల వివరాలపై ఆరా
- ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు కౌన్సెలింగ్‌కు చర్యలు



వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

కడప రూరల్ : కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్‌–4) పరిధిలో ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించిన ప్రక్రియ వేగవంతమైంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ శాఖ పరిధిలో బదిలీల కోలాహలం నెలకొంది.

మొత్తం 4 వేల మందికి పైగా ఉద్యోగులు...
ఈ శాఖ పరిధిలో ఇప్పటికే పరస్పర బదిలీలు (మ్యూచువల్) ముగిశాయి. తాజాగా సాధారణ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది.ఈ శాఖ పరిధిలో రాయలసీమ వ్యాప్తంగా దాదాపు 30 కేడర్‌లకు సంబంధించి 4 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందులో మొత్తం ఉద్యోగుల్లో 30 శాతం చొప్పున ఐదేళ్ల సర్వీసు నిండిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సివుంటుంది. 30 శాతం చొప్పున అంటే దాదాపు 1200 మంది ఉద్యోగులు పరిగణలోకి వస్తారు. అయితే ఇప్పటికే పరస్పర బదిలీలు జరిగిన కారణంగా తాజాగా చేపట్టే సాధారణ బదిలీల్లో 600 మంది ఉద్యోగులు ఉంటారని అంచనా. కాగా రెండేళ్ల సర్వీసు నిండిన వారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి అవకాశం ఉంటే 30 శాతం చొప్పున చేపట్టే బదిలీల్లో పోస్టింగ్‌కు ఆస్కారం ఉంటే బదిలీ కావచ్చు. అలాగే దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులు, భార్య భర్తలుగా ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకు సంబంధించి ఆ శాఖ అధికారులు ఉద్యోగుల సర్వీసు వివరాలను సేకరిస్తున్నారు. అందులో నుంచి సీనియారిటీ ప్రకారం 30 శాతం పరిధిలోకి వచ్చే ఉద్యోగల జాబితాను సిద్ధం చేస్తారు.

అడ్డదారుల కోసం ఆరా....
కొంత మంది ఉద్యోగులు దీర్ఘకాలికంగా ‘ఫెవికాల్’ వీరుల్లా ఏళ్ల తరబడి ఒకే సీటులో విధులను చేపడుతున్నారు. అందులో కొంతమంది జరగబోవు సాధారణ బదిలీల నుంచి తప్పించుకోవడానికి పరస్పర బదిలీలను సద్వినియోగం చేసుకున్నారు. ఇంకా చాలా మంది ఉద్యోగులు ఉన్నచోటే విధులను చేపట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. అడ్డదారుల కోసం వెతుకుతున్నారు. కాగా సాధారణ బదిలీల్లో ఏపీ ఎన్జీఓ అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి మాత్రమే వర్తింపు ఉంది. ఈ సంఘాల్లో పనిచేసే సభ్యులకు మాత్రమే బదిలీల నుంచి కొంత మినహాయింపు ఉంది. అంటే ఈ సంఘాల్లోని సభ్యులకు సాధారణ బదిలీల నుంచి మూడు దఫాలు లేదా 9 ఏళ్ల సర్వీసు వరకు మినహాయింపు ఉంటుంది. అంటే తొమ్మిదేళ్ల సర్వీసు పూర్తయిన వారు తప్పని సరిగా బదిలీ కావాల్సివుంటుంది. కాగా కొంతమంది ఏ అసోసియేషన్‌లో పని చేయనప్పటికీ బదిలీల నుంచి తప్పించుకోవడానికి అప్పటికప్పుడు ఏదో ఒక అసోసియేషన్ నుంచి సంఘంలో సభ్యత్వం ఉన్నట్లుగా లేఖలను సిద్ధం చేసుకుంటున్నట్లుగా ఆ శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇలా కొంతమంది ఉద్యోగులు తమ స్థానాలను వదలకుండా ఉండడానికి పలు విధాలుగా అడ్డదారులను వెదుకుతున్నట్లుగా సమాచారం.

పారదర్శకంగా బదిలీలు..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా సాధారణ బదిలీలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు. నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి. ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలి.
– డాక్టర్ అనిల్‌కుమార్, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

పాల ఉత్పత్తి, సేకరణ విస్తృతం చేయాలి

కలెక్టర్ విజయరామరాజు



కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పాల ఉత్పత్తి, సేకరణ విస్తృతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. జగనన్న పాల వెల్లువ, అమూల్ ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా బుధవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలోని 25 విస్తరణ గ్రామాల్లో పాల ఉత్పత్తి దారుల నుంచి పాల సేకరణ వేగవంతంగా చేపట్టాలన్నారు. ఎంపీడీఓలు, మెంటార్లు, ఆర్‌ఐసీ, ఏపీడీడీసీఎఫ్ అధికారులు పూర్తి బాధ్యతతో కార్యచరణ చేపట్టాలన్నారు. రిజిష్టర్ అయిన పాడి రైతులు క్రమం తప్పకుండా పాలు పోసేలా చూడాలన్నారు. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్న గ్రామాల్లో రైతులను ప్రోత్సహించాలని సూచించారు. బల్క్ మిల్క్ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రి య చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి సుభాషిణి, ఏపీడీడీసీఎఫ్ పులివెందుల ఇన్‌ఛార్జి ఎల్.వెంకటేశ్వరమ్మ, పశు సంవర్ధకశాఖ జేడీ శారద, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ పాల్గొన్నారు.

గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
గర్భిణీల ఆరోగ్య స్థితిపై సచివాలయ ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభా భవనంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎక్కడా పోషకాహారలోపం, రక్త హీనత వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సచివాలయం నుంచి మండల స్థాయి వరకు వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. వైద్యాధికారులు క్రమం తప్పకుండా రోజూ విధులకు హాజరు కావాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందే వైద్య సేవలు, వైద్యాధికారుల పనితీరు, ఆరోగ్య కేంద్రంలో ఓపీల నమోదు సంఖ్యను పెంచాలని చెప్పారు. మాతా శిశుమరణాల సంఖ్య తగ్గాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను అన్ని మండలాల్లో సక్రమంగా అమలు జరిగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయ వారీగా జన సంఖ్యను పరిగణలోకి తీసుకుని వయస్సుల వారీగా ఆరోగ్య సమస్యలను గుర్తించాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలని, సీజనల్ డ్రగ్స్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనం.. ఉపాధిలో ఉచితం

- గత రెండు సంవత్సరాల కంటే ఈ ఏడాది ప్లాంటేషన్‌కు అధిక ప్రాధాన్యత
- సన్న, చిన్నకారు రైతులకు సుస్థిర ఆదాయమార్గం ఏర్పాటు చేయడమే లక్ష్యం
- మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు
- ఈ ఏడాది 5500 ఎకరాల్లో ప్లాంటేషన్ లక్ష్యం
- ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలి



ఉపాధి ద్వారా సాగు చేసిన మామిడి తోట

కడప సిటీ : ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు రైతులకు సుస్థిర ఆదాయ మార్గం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా ఉపాధిలో ఉచితంగా ఉద్యానవనాలు పెంచేందుకు శ్రీకారం చుట్టింది. మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చును కూడా ప్రభుత్వమే భరిస్తోంది. అందులో భాగంగా ఉద్యాన పంటల ద్వారా రైతుకు ఆదాయం చేకూరే మార్గాన్ని పండ్ల తోటల ద్వారా ప్రభుత్వం చూపుతోంది. గతేడాది 2022–23 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 1200 ఎకరాలు పండ్ల తోటల లక్ష్యం కాగా, 1800 ఎకరాల్లో ప్లాంటేషన్ లక్ష్యాన్ని వైఎస్సార్ జిల్లా అధిగమించింది. ఈ ఏడాది 5500 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి లక్ష్యాన్ని నిర్దేశించింది. జూన్ 10వ తేదీలోపు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు వివరించారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు పెరిగి కాపు వచ్చేంతవరకు దాదాపు అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది.

ఎవరు అర్హులు?
కుటుంబం మొత్తానికి ఐదు ఎకరాలు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగి, ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగిన వారు అర్హులు.

పండ్ల తోటల రకాలు
మామిడి, చీనీ, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్ రేగు, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, మల్లె తోటలతోపాటు కొత్తగా మునగ మొక్కల ప్లాంటేషన్, మునగ మొక్కల నర్సరీలకు కూడా ప్రోత్సాహం.

దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు
1–బీ, జాబ్‌కార్డులోని వారి ఆధార్ నంబర్లు, పొలం పట్టాదారు పాసు పుస్తకం నకలు.

ఎవరిని సంప్రదించాలి?
మీ గ్రామంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేదా మండల ఉపాది హామీ ఏపీఓ లేదా ఈసీ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్, ప్లాంటేషన్ మేనేజర్‌ను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు 9000890293 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

గడువు ఇలా
ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 10వ తేదీ వరకు గడువు ఉంది.

అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి



ఉపాధి హామీ ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఒక సుస్థిర ఆదాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం అర్హులైన రైతులకు పండ్ల తోటల పెంపకానికి అవకాశం ఇచ్చింది. సంబంధిత రైతులు దాదాపు 14 రకాల పండ్ల మొక్కలు పూర్తిగా ఉచితంగా ఇవ్వడంతోపాటు పండ్ల తోటల రకాన్ని అనుసరించి 2–3 సంవత్సరాలు నిర్వహణ ఖర్చులు కూడా ప్రభుత్వం లబ్ధిదారులకు ఇస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థికంగా నిలదొక్కుకోవాలి.
– యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

సింహాద్రిపురం : సింహాద్రిపురంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పులివెందుల ఆర్డీఓ వెంకటేశులుతో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. గణేష్ కుమార్ జేసీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా సింహాద్రిపురం రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో జరుగుతున్న భూ రీసర్వేపై ఆరా తీశారు. అలాగే ఇక్కడ సమస్యలపై కూడా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐలు షేక్షావల్లి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన బీబీ

దువ్వూరు : మండల పరిధిలోని కానగూడూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి కారు ఢీకొనడంతో చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన బీబీ (50) దుర్మరణం చెందింది. అదే గ్రామానికి చెందిన గౌస్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాలపాడుకు చెందిన గౌస్ బాషా, బీబీ రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి తమ గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. కానగూడూరు సమీపాన కడప నుంచి నంద్యాల వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో బీబీ అక్కడికక్కడే చనిపోగా, గౌస్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన గౌస్ బాషాను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

వీరబల్లి (రాయచోటిటౌన్) : వీరబల్లి మండలం ఆసాదివాండ్లపల్లెకు చెందిన నాగవేణి (23 ఆత్మహత్య చేసుకుంది. నాగవేణి రాయచోటి పట్టణంలోని ఓ బట్టల షాపులో గుమస్తాగా పని చేస్తుండేది. రోజు మాదిరిగా బుధవారం రాయచోటికి వెళ్తున్నానని ఇంటి దగ్గర చెప్పి వెళ్లింది. అయితే మార్గంమధ్యలో ఏమి జరిగిందో తెలియదు కానీ క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బాధితురాలిని కడప ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో ఆమె మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

ఆరోపణలపై చర్చకు సిద్ధం

- నారా లోకేష్, భూపేష్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సవాల్
- దేవగుడికైనా వస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : 'నారా లోకేష్, భూపేష్‌లు తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలి. దీనిపై చర్చించటానికి తాను దేవగుడికైనా రావటానికి సిద్ధం' అని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలకు ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎక్కడైనా భూదందాలకు, ఇసుక దందాలకు పాల్పడి ఉంటే నిరూపించాలన్నారు. నారాపుర స్వామి దేవాలయంలో ప్రమాణం చేద్దాం అంటూ సవాల్ విసిరారు. తనకు మట్కా, గ్యాంబ్లింగ్ ఆడటం లాంటి అలవాట్లు లేవన్నారు. నారాలోకేష్ పక్కన కూర్చున్న మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డిపై 2020లో గ్యాంబ్లింగ్ కేసు నమోదు అయిందన్నారు. ఆలీబాబా అరడజను దొంగలను నారాలోకేష్ పక్కన పెట్టుకున్నారన్నారు. టౌన్ బ్యాంక్ డైరెక్టర్‌లుగా ఉండి అందులో సొమ్ము అంతా మాయం చేసిన వారు మీవద్దే ఉన్నారన్నారు. తమ కుటుంబం నాలుగు తరాల నుంచి జమిందారులమని, రెండు వేల ఎకరాల భూస్వాములమని, తమ గురించి జిల్లాలో నిడిజివ్వి రెడ్లు అంటే ఎవరైనా చెబుతారన్నారు. దేవగుడి వాళ్ల చరిత్ర ఎలాంటిదో ప్రజలందరికీ తెలుసు అన్నారు. మీరు వస్తే మరి అరాచకమని భావించే ప్రజలు తనకు భారీ మెజార్టీని ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు.

వైఎస్ కుటుంబంతోనే నియోజకవర్గ అభివృద్ధి

ఆది అంటే అభివృద్ధి అని అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని.. ఫ్యాక్షన్ రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజలు సంతోషంగా కష్టపడి పని చేసుకోవాలనే ఆలోచనతో మైలవరంలో దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీతోపాటు బ్రహ్మిణి స్టీల్ ప్లాంట్‌ను తీసుకుని వచ్చారన్నారు. నియోజకవర్గ క్షేమాన్ని కాంక్షించేది వైఎస్ కుటుంబ సభ్యులే కాబట్టి ఆయన కుమారుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం స్టీల్‌ప్లాంట్ కోసం ముమ్మర ప్రయత్నం చేశారన్నారు. అందులో భాగంగానే జిందాల్ కంపెనీతో స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. 15 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉంటూ మీ బాబాయ్ చేసింది ఏమీ లేదని భూపేష్‌ను ఉద్దేశించి అన్నారు. రామసుబ్బారెడ్డిని పార్టీ ప్రత్యేక స్థానంలో కూర్చోబెట్టిందన్నారు. ఆయన కుటుంబానికి తమ కుటుంబానికి ఎటువంటి ఫ్యాక్షన్, గొడవలు, కొట్టుకున్న చరిత్ర లేదన్నారు. తాము శత్రువులం కాదని, ఒకే పార్టీలో ఉన్నాం కాబట్టి రామసుబ్బారెడ్డి ఇంటికి వెళ్లడం జరిగిందన్నారు. రామసుబ్బారెడ్డికి ప్రచారం చేస్తామంటూ 60 లక్షల రూపాయలు తీసుకుని నిట్ట నిలువునా ముంచిన ఘన చరిత్ర మీకుందన్నారు. అంతేకాకుండా పార్టీలు మారుతూ పారిపోయే చరిత్ర దేవగుడి కుటుంబీకులదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రమణారెడ్డి జీకే తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ మాసుంబాషా

ప్రొద్దుటూరు క్రైం : నకిలీ విత్తనాలను విక్రయిస్తే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ మాసుంబాషా తెలిపారు. బుధవారం ప్రొద్దుటూరులోని భారత్ సీడ్స్, పెస్టిసైడ్స్‌తోపాటు పలు దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. గోడౌన్లు, దుకాణాల్లోని విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. అలాగే అమ్మకం, కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్స్‌లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య జిల్లాల్లోని విత్తన కేంద్రాల్లో వ్యవసాయాధికారులతో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. నకిలీ విత్తనాలు, అధిక ధరలు, బ్రాండెడ్ తేడాలపై దృష్టి సారించామని చెప్పారు. వీటిలో ఏవైనా తేడాలుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రైతులు ఒకటికి రెండు సార్లు పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా కావలసిన సమాచారాన్ని తీసుకోవచ్చని తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ ఇదురుబాషా, ఏఓ బాలగంగాధర్, ఏఈఓ కిశోర్, హెడ్‌కానిస్టేబుల్ జనార్ధన్‌రావు, ప్రొద్దుటూరు ఏఓ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండు సీడ్స్ ఏజెన్సీల్లో..

ఆయా కంపెనీలకు చెందిన సోర్స్ సర్టిఫికెట్ లేనందున రెండు సీడ్స్ ఏజెన్సీల్లో విత్తన అమ్మకాలను నిలిపేయాలని అడిషనల్ ఎస్పీ మాసుంబాషా పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని భారత్ సీడ్స్ ఏజెన్సీస్‌లో తిరుమల కంపెనీకి చెందిన సోర్స్ సర్టిఫికెట్ లేకపోవడంతో రూ.156800 విలువ చేసే మినుము విత్తనాల అమ్మకాన్ని నిలుపుదల చేశారు. అలాగే శ్రీ వెంకటేశ్వర సీడ్ ఏజెన్సీస్‌లో తులసీ సీడ్స్ కంపెనీకి చెందిన రూ.127950 విలువ గల పత్తి విత్తనాలకు సోర్స్ సర్టిఫికెట్ లేనందున వాటి అమ్మకాలను అధికారులు నిలిపేశారు.

రూ. 1.76 లక్షల టపాసులు స్వాధీనం

రాజంపేట : పట్టణంలోని బంద్రాళ్ల వీధిలో అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న బాణసంచా దుకాణాన్ని సీజ్ చేశామని రాజంపేట డీఎస్పీ చైతన్య వెల్లడించారు. బుధవారం టౌన్‌పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పచ్చిపులుసు లక్ష్మీనారాయణ జననివాసాల మధ్య రూ.1.76 లక్షల విలువ చేసే బాణాసంచాలను నిల్వ ఉంచగా స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమ కేబుల్ సర్వీస్ ఇస్తున్న వ్యక్తిపై కేసు

కలకడ : యాజమాన్యం అనుమతి లేకుండా కొన్ని చానళ్లను అక్రమంగా టెలివిజన్ సర్వీస్ లబ్ధిదారులకు అందిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సునీల్‌కుమార్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటికి చెందిన శివ(శివకుమార్) కలకడ మండలం కోన గ్రామంలో ఏటివికేబుల్ నెట్‌వర్క్ ఇంటింటికి కేబుల్ సరఫరా చేసి వినోదం పంచుతున్నాడు. అయితే స్టార్‌ఛానల్, జీ తెలుగు చానెల్‌లు అనుమతి లేకుండా ఆపరేట్ చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు మహమ్మద్‌కులియా, ఖురేషి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేబుల్ ఆపరేటర్ శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఒంటి పూట బడిలా.. లోకేష్ పాదయాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర ఒంటిపూట బడిని తలపిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అంతకుముందు వైఎస్ రాజశేఖరరెడ్డి రోజూ రెండు పూటలా పాదయాత్రను మండుటెండలో చేశారన్నారు. మరో వైపు ఉదయం, సాయంత్రం కార్యకర్తలు, నాయకులతో మాట్లాడేవారని తెలిపారు. వైఎస్‌కు కాళ్లు బొబ్బలు కట్టిన చిత్రాలను కూడా మనం చూశామన్నారు. అయితే లోకేష్ పాదయాత్ర అందుకు భిన్నంగా కొనసాగుతోందని విమర్శించారు. రోజూ రాత్రి వేళలో మాత్రమే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని, మరుసటి రోజు సాయంత్రం వరకు గుడారంలోనే ఉంటున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పాదయాత్ర చేస్తున్నప్పుడు పగటి పూట ప్రజలను కలవాల్సిన అవసరం ఉందన్నారు. అలా కాకుండా తన ఆరోగ్యం కోసం పగలంతా గుడారంలో ఉండి రాత్రిపూట చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న నారా లోకేష్ నాయుడు పాదయాత్రను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరూ అడ్డుకోవద్దని అన్నారు. టీడీపీ నేతల ఇష్టప్రకారమే రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకుని యాత్రను కొనసాగిస్తున్నారన్నారు. నారా లోకేష్‌ను రాజకీయ నాయకుడిగా ఎవరూ చూడొద్దని, కేవలం బాటసారి ప్రయాణికుడిలా మాత్రమే పరిగణించాలన్నారు. ఆయన నిర్ణయించుకున్న టార్గెట్ ప్రకారం 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్నారని, ప్రజలను మాత్రం కలవడం లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఏపీపీఎస్సీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయానికి లాకర్ వితరణ



సంగమేశ్వరాలయానికి చేరిన లాకర్

వీరపునాయునిపల్లె : కడప పట్టణంలోని ప్రముఖ చిన్న పిల్లల డాక్టర్ కరుణాకర్‌రెడ్డి సంగమేశ్వరునికి లాకర్ వితరణ చేశారు. అమ్మవారు, సంగమేశ్వరుని ఆభరణాలు భద్రపరిచేందుకు వీలుగా లాకర్‌ను ఏర్పాటు చేయాలని ఆలయ చైర్మన్ శివాంజనేయ రెడ్డి డాక్టర్ కరుణాకర్‌రెడ్డిని కోరారు. దీనిపై స్పందించిన ఆయన 3.5 లక్షల విలువగల లాకర్‌ను వితరణ చేశారు. ఆ లాకర్‌ను ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి మంగళవారం ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ ఎండీ విశ్వేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి బ్రదర్స్ అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. గత వారంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో కల్యాణ మండపం నిర్మించేందుకు మ్యాచింగ్ గ్రాంటు 40 లక్షల రూపాయలు అందించడం జరిగిందని తెలియజేశారు. గత నాలుగు సంవత్సరాలుగా మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కరుణాకర్‌రెడ్డి బ్రదర్స్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

బ్రౌన్‌కు 'కేతు' సేవలు మరువలేనివి



ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ, సాహితీవేత్తలు

కడప కల్చరల్ : తెలుగు వారికి గర్వకారణంగా నిలిచిన సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి ప్రముఖ కథకులు, బ్రౌన్ గ్రంథాలయం సలహా మండలి సభ్యులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం ఈ కేంద్రానికి తీరని లోటుగా భావిస్తున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం బ్రౌన్ కేంద్రంలో ప్రసిద్ధ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. వైవీయూ వీసీ చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పరిశోధన కేంద్రం సిబ్బంది తదితరులతో కలిసి కేతు విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ చింతా సుధాకర్ మాట్లాడుతూ ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా, నిరంతరం సృజనశీలిగా పేరు గాంచారన్నారు. తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి మానవ సంబంధాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి రచనలు చేశారన్నారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులుగా ఆచార్య కేతు అందించిన సేవలు ఈ కేంద్రం అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయన్నారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆచార్య కేతు జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు వెంకట రమణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ఓబులేసు (ఫైల్)



సుదర్శన్ (ఫైల్)



సంఘటనా స్థలంలోనే మృతి చెందిన ఓబులేసు, సుదర్శన్

రాజుపాళెం : మండలంలోని పగిడాల బైపాస్ రహదారిలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్లాల గ్రామానికి చెందిన ఇండ్ల ఓబులేసు (35), దండు సుదర్శన్ (45) వెంగలాయపల్లె వైపు నుంచి స్వగ్రామమైన వెల్లాల గ్రామానికి బైక్‌పై బయదేరారు. పగిడాల గ్రామానికి చెందిన ట్రాక్టరు బైపాస్ రహదారి వద్ద మలుపు తిరుగుతోంది. ఈ క్రమంలో ట్రాక్టర్, బైక్ ఢీకొనడంతో ఓబులేసు, సుదర్శన్ అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రాజగోపాల్, ఏఎస్ఐ సుబ్బారెడ్డి పరిశీలించారు. సమాచారం అందుకున్న మృతుల భార్య, పిల్లలు, బంధువులు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ప్రమాదం ఆ రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పెద్ద పుల్లన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి ప్రాధాన్యం



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందిస్తున్న సమగ్రశిక్ష, వికలాంగుల సంక్షేమ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : దివ్యాంగ విద్యార్థులు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కృష్ణ కిషోర్ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణలో సమగ్ర శిక్ష, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 243 మంది దివ్యాంగ విద్యార్థులకు దాదాపు రూ.36 లక్షల విలువ చేసే బోధన ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్ష ప్రాజెక్టు దివ్యాంగులకు ఒక వరం లాంటిది అన్నారు. సమగ్రశిక్ష ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, రోటేటర్లు, చంకకర్రలు, ఒంటి సహాయక ఉపకరణాలతోపాటు నైపుణ్యాల పెంపుదలకు అవసరమైన బోధనోపకరణాల పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త మిట్ట చెన్నకేశవ రెడ్డి, సహాయక సమన్వయకర్త ఉమ్మడి రమణమూర్తి, సెక్టోరల్ అధికారులు దశరథరామిరెడ్డి, రజనీకాంత్ రెడ్డి, విజమయ్మ, సిద్ధారెడ్డి, మమత నెల్లూరు సీఆర్‌సీ సెంటర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సొసైటీ పాఠశాల విద్యాశాఖ ద్వారా నిర్వహిస్తున్న ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులకు ఒప్పంద ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలానికి భర్తీ చేయుటకు దరఖాస్తులను కోరుతున్నట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రిన్సిపాల్స్ పోస్టులకు సంబంధించి 9, పిజిటి జనరల్‌కు 80, సీఆర్టీ 22, పీఈటీ 7 మొత్తంగా 118 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు ఆసక్తి గల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను apkgbv.apcfcc.in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జూన్ 5వ తేదీ రాత్రి 11.59 వరకు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్‌లో ఫిజికల్ దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. వయో పరిమితి ఓపెన్ కేటగిరి అభ్యర్థులకు 18 నుంచి 42 ఏళ్లు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5, మాజీ సైనిక ఉద్యోగులకు 3, దివ్యాంగులకు 10 ఏళ్లు సడలింపు ఉంటుందని తెలిపారు. జిల్లాల వారిగా సబ్జెక్టు వారిగా రోస్టర్ వారిగా పోస్టుల ఖాళీలు, విద్యార్హతలను వెబ్‌సైట్‌లో ఉంచిన పూర్తి నోటిఫికేషన్ ద్వారా పొందవచ్చని తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

గుర్రంకొండ : పిడుగు పడి పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లుట్ల గ్రామ కస్పాలో జరిగింది. గ్రామానికి చెందిన సాప్పారపు రామాంజులు పాడిఆవులు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం పాడిఆవులను గ్రామ సమీపంలోని తమ పొలానికి తోలుకెళ్లాడు. ఉన్నట్టుండి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో.. వాటిని తొందరగా ఇంటికి తొలుకొస్తున్నాడు. మార్గంమధ్యలో ఉన్నట్టుండి పిడుగు మీద పడడంతో పాడిఆవు అక్కడికక్కడే మృతి చెందింది. వీఆర్వో వెంకటరమణ గ్రామానికి చేరుకొని సంఘటనపై విచారణ జరిపి ఉపతహసీల్దార్ శ్రీనివాసరావుకు నివేదిక అందజేశారు.

ఒంటిమిట్టలో స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్



ఆలయంలోని బలి పీఠానికి నమస్కరిస్తున్న ఏపీ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ జనార్ధన్‌రావు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన సీతారామలక్ష్మణ మూర్తులను బుధవారం ఏపీ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ జనార్ధన్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ లాంఛనాలతో అర్చకులు స్వాగతం పలికారు. ఆయన ఆలయ ప్రదక్షిణ చేసి, గర్భాలయంలో ఉన్న మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగ మండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గోపవరం ఆర్బీకేలో చోరీ

గోపవరం : మండలంలోని గోపవరం రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. అందులో ఉన్న ప్రింటర్, ఎల్‌ఈడీ టీవీలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. రోజూ మాదిరే మంగళవారం విధులకు హాజరైన ఆర్బీకే ఇన్‌చార్జి విజయ్.. తాళం పగులగొట్టి ఉండటంతో అనుమానం వచ్చి అక్కడే ఉన్న రైతులతో కలిసి డోర్ తీసి లోపలికి వెళ్లాడు. అందులో ఉన్న ప్రింటర్, ఎల్‌ఈడీ టీవీ లేకపోవడంతో చోరీకి గురైనట్లు భావించి బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ, ఏఓ అరవిందనాయక్‌కు సమాచారమిచ్చారు. వారి ఆదేశాల మేరకు బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఆర్బీకేను సందర్శించి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. క్లూస్‌టీం వచ్చి పరిశీలించి వెళ్లారు. చోరీకి గురైన ప్రింటర్, ఎల్‌ఈడీ టీవీ విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సచివాలయాలన్నీ గ్రామానికి చివరలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దుండగులు కార్యాలయాలను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గోపవరం డంపింగ్‌యార్డుకు నిప్పు పెట్టడం, ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉన్న వైరును దొంగలించారు. సచివాలయం వద్ద కేబుల్, ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ బోరుబావి పైపులు చోరీకి గురయ్యాయి. స్థానికంగా ఉన్న వారే చోరీలకు పాల్పడుతున్నట్లు అధికారులతోపాటు పోలీసులు భావిస్తున్నారు. ఆ కోణంలోనే పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు.

బైక్‌ను ఢీకొన్న బొలేరో : ఒకరి మృతి

సంబేపల్లి : చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం బొలేరో వాహనం, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాల పాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లక్కిరెడ్డిపల్లెకు చెందిన సికారు సుబ్బరాయుడు(47), గురుకుమార్‌తో కలిసి బైక్‌పై కలకడ మండల గుడిబండకు బయలుదేరారు. మార్గంమధ్యలోని నారారాయణరెడ్డిపల్లె పంచాయతీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు రాగానే రాయచోటి వైపు నుంచి వస్తున్న బొలేరో పికప్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ సుబ్బరాయుడు, గురుకుమార్‌ను రాయచోటి ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ సుబ్బరాయుడును తిరుపతి రూయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కారు, స్కూటర్ ఢీకొని..

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని చొప్పావారిపల్లె క్రాస్(రాజంపేట)లో బుధవారం సాయంత్రం కారు, స్కూటర్ ఢీకొని ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. గుండ్లూరు నుంచి జాఫర్, అస్రఫ్‌లు స్కూటీపై చొప్పావారిపల్లె క్రాస్ వద్ద హైవేలోకి ప్రవేశించారు. ఇదే క్రమంలో కడప నుంచి తిరుపతికి కారు వెళ్తోంది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. గాయపడిన వారు ఎల్లాగడ్డకు చెందిన వారిగా గుర్తించారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం రాజంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.